సాక్షి
జగిత్యాల
బుధవారం ၊ 25 ၊ అక్టోబర్ ၊ 2023

దుర్గాదేవికి ఘనంగా వీడ్కోలు



జగిత్యాలటౌన్: అమ్మవారి శోభాయాత్ర



రాయికల్: మంగళహారతితో మహిళలు

జగిత్యాలటౌన్/రాయికల్: నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో అమ్మవారిని ఆయా చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. జిల్లావ్యాప్తంగా నెలకొల్పిన విగ్రహాలను ఆయా గ్రామాలు, పట్టణాల్లోని పురవీధుల మీదుగా శోభాయాత్ర నిర్వహించి చెరువుల్లో నిమజ్జనం చేశారు. రాయికల్‌లో నవదుర్గ సేవ సమితి, సంఘమిత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గాదేవి పత్ర్యేక అలంకరణ ఆకట్టుకుంది. జిల్లాకేంద్రంలో నెలకొల్పిన అమ్మవారిని స్థానిక చింతకుంట చెరువులో నిమజ్జనం చేశారు.

న్యూస్‌రీల్

సొంతూరుకొచ్చిన ఐఏఎస్‌లు



మెట్‌పల్లిలో సింగరేణి సీఎండీ శ్రీధర్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్

మెట్‌పల్లి: దసరా పండుగ సందర్భంగా పట్టణానికి చెందిన సింగరేణి సీఎండీ శ్రీధర్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ కుటుంబసమేతంగా సొంతూరుకు వచ్చారు. రెండు రోజులపాటు ఇక్కడే ఉండి స్నేహితులు, బంధువులను కలుసుకున్నారు. అందరితో కలిసి దసరా వేడుకలు జరుపుకున్నారు. వీరిద్దరూ ఒకేచోట కలుసుకుని పలు విషయాలపై మాట్లాడుకున్నారు.

వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి



సిబ్బందికి సూచనలిస్తున్న అడిషనల్ ఎస్పీ

రాయికల్: ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు సూచించారు. మండలంలోని బోర్నపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. అనుమానితులుగు గుర్తిస్తే వారి వివరాలను ఎన్నికల అధికారులకు వివరించాలన్నారు. నిబంధనల ప్రకారం రూ.50వేల కంటే ఎక్కువగా తీసుకెళ్తే సీజ్ చేసి ఎన్నికల అధికారులకు అప్పగించాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్, ఎస్సై అజయ్ పాల్గొన్నారు.

ఘనంగా సాయి పుణ్యతిథి



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలటౌన్: సాయి పుణ్యతిథి వేడుకను మంగళవారం జిల్లా కేంద్రంలోని బైపాస్‌రోడ్డులోగల సాయిబాబా ఆలయంలో ఘనంగా నిర్వహించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సాయిబాబా విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు నాగుల కిషన్‌గౌడ్, మానాల కిషన్, గొల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు అల్లె గంగాసాగర్, ప్రేమలత పాల్గొన్నారు.

ఓటును అమ్ముకోకండి..



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కనకదుర్గ సేవాసమితి

జగిత్యాలటౌన్: ఎన్నికల్లో ఓటును ఎవరూ అమ్ముకోవద్దని పేర్కొంటూ కనకదుర్గ సేవాసమితి సభ్యులు జగిత్యాల జంబిగద్దె చౌరస్తా వద్ద దిష్టిబొమ్మ ప్రజలను ఆలోచింపజేసింది. 'డోంట్ ఓట్ ఫర్ ఫ్రీబీస్' అంటూ.. రానున్న ఎన్నికల్లో నోటు, మందు వంటి తాయిలాలకు అమ్ముడుపోవద్దని అవగాహన కల్పించేలా రూపొందించిన దిష్టిబొమ్మను దహనం చేశారు. కనకదుర్గ సేవా సమితి ప్రతినిధి గుగ్గిల్ల నాగభూషణం మాట్లాడుతూ ప్రలోభాలకు ఓట్లు వేయకుండా అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణ

జగిత్యాలటౌన్: విజయదశమి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ధర్మస్థలిలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. జగిత్యాల టవర్ సర్కిల్‌లోని ధర్మస్థలి వద్ద సోమవారం విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు జిట్టవేణి అరుణ్ ధ్వజారోహణ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ గౌరవ అధ్యక్షుడు వెంకటరాజిరెడ్డి, జిల్లా సహ కార్యదర్శి గాజోజు సంతోష్, కోశాధికారి మామిడాల రాములు, నగర ప్రముఖ్ శ్రీధర్ భూమేష్ ఆర్‌ఎస్‌ఎస్, భారత్‌సురక్షాసమితి, హిందూవాహినీ, సామాజిక సమరత సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దసరా వేడుకలు



రాయికల్‌లో వేడుకలు, డోలు వాయిస్తున్న మహారాష్ట్ర కళాకారిణి

రాయికల్/జగిత్యాలటౌన్/జగిత్యాలరూరల్/సారంగాపూర్: జిల్లాలో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. శమీవృక్షానికి పూజలు చేసిన అనంతరం జమ్మి ఆకును ఒకరినొకరు ఇచ్చుకుని ఆనందాలు పంచుకున్నారు. అనంతరం రావణ దహనం చేపట్టారు. కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాయికల్‌లోని శివాజీ చౌక్ వద్ద నిర్వహించిన వేడుకల్లో వేలాది మంది జనం హాజరయ్యారు. మహారాష్ట్ర కళాకారుల డోలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఎస్సై అజయ్‌కుమార్ బందోబస్తు చేపట్టారు. జిల్లాకేంద్రంలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిపోయాయి. ప్రత్యేక దర్శనాలు, వాహనపూజలతో సందడిగా మారాయి.శమీపూజలో ఆర్డీవో నర్సింహామూర్తి దంపతులు పాల్గొన్నారు. లక్ష్మీపూర్‌లో భక్తుల కోలాటాల మధ్య నృసింహస్వామిని ఊరేగించారు. శమీవృక్షం చుట్టూ నృసింహస్వామికి శోభాయాత్ర చేపట్టారు. ముస్లిం మత పెద్ద ఎండీ.హబీబ్ పాల్గొన్నారు. సారంగాపూర్ మండలంలోని దుబ్బరాజన్న ఆలయంలో, బీర్‌పూర్‌లోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.



జగిత్యాలటౌన్: జిల్లాకేంద్రంలో రావణదహనం



పూజల్లో ఆర్డీవో నర్సింహామూర్తి



సారంగాపూర్: బీర్పూర్‌లో అమ్మవారి నిమజ్జనం



సారంగాపూర్: దుబ్బరాజన్న ఆలయం ఆవరణలో వేడుకలు



దసరా సందర్భంగా స్వాముల ఊరేగింపు



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

ధర్మపురిలో ముఎ్వరు స్వాముల ఊరేగింపు

ధర్మపురి: ధర్మపురితోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో దసరా వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. శ్రీలక్ష్మినృసింహస్వామి ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఎ్వరు స్వాములైన యోగా, ఉగ్ర, వేంకటేశ్వరస్వాములను ఆలయం నుంచి జంబిగద్దె వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం సీఐ రమణామూర్తి, ఎస్సై దత్తాత్రి గాల్లోకి రెండురౌండ్లు కాల్పులు జరిపారు. స్వాములను జయజయధ్వనాల మధ్య శోభయాత్రగా తీసుకెళ్లారు.

సిద్ధిదాత్రి రూపంలో అమ్మవారు





ధర్మపురిలో సిద్ధిదాత్రి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు, చండీహోమంలో పాల్గొన్న భక్తులు

ధర్మపురి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు సోమవారం సిద్ధిదాత్రి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామి అనుబంధం శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా జరిపిస్తున్నారు. తొమ్మిదోరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా చండీహోమం చేపట్టారు. అనంతరం మంగళవారం అమ్మవారి కలశానికి వేలం నిర్వహించారు. ఈ వేలం పాటలో రూ.18,016కు పట్టణానికి చెందిన చిలువేరు రాజయ్య దక్కించుకున్నారు.

ఎస్పీ కార్యాలయంలో ఆయుధపూజ



ఆయుధపూజలో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



వాహన పూజలో..

జగిత్యాలక్రైం: దసరా సందర్భంగా సోమవారం జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆయుధపూజలో పాల్గొన్నారు. అనంతరం వాహనపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పోలీసు శాఖ ప్రజారక్షణలో ముందుంటుందని పేర్కొన్నారు. పోలీస్‌శాఖకు గౌరవ, కీర్తిప్రతిష్ఠలు పెంపొందించేలా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. అదనపు ఎస్పీలు ప్రభాకర్‌రావు, భీంరావు, డీఎస్పీలు వెంకటస్వామి, రవీంద్రకుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు జానీమియా, రామకృష్ణ, వేణు, టౌన్‌సీఐ నటేశ్‌గౌడ్, ఎస్బీ సీఐ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అబుదాబి, ఆస్ట్రేలియాలో బతుకమ్మ సంబరాలు



రాయికల్: అబుదాబిలోని తెలంగాణ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ సోషల్ అండ్ కల్చరల్ సెంటర్‌లో బతుకమ్మ సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ నుంచి వివిధ రకాల పూలను అబుదాబికి తెప్పించుకుని మహిళలు బతుకమ్మ పేర్చి గౌరీదేవిని ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆడిటోరియంకు తీసుకొచ్చారు. కోలాటాల మధ్య బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూఏఈ భారత రాయబార కార్యాలయం డెప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ అమర్‌నాథ్ అశోకన్, కౌన్సిలర్ బాలాజీ పాల్గొని ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు అందజేశారు. ఆస్ట్రేలియాలోని తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10వ వార్షికోత్సవ బతుకమ్మ సంబరాలు మెల్‌బోర్న్ నగరంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తేలు విజయ హాజరై మహిళలను తన ఆట పాటలతో ఆడిపడటంతో ఆడిటోరియం మార్మోగింది. నిర్వాహకులు గోపాల్, రాజ శ్రీనివాస్, వంశీ, కమలాకర్, శ్రీనివాస్, సాగర్, శ్రీనివాస్‌రెడ్డి, పద్మజ, లక్ష్మీ సుధ, ఆస్ట్రేలియా తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ బైరెడ్డి, సభ్యులు పాలడుగు కిరణ్, ఫణికుమార్, వంశీ, రవీష్, మహేశ్‌రెడ్డి, రఘు కోట్ల, రాజవర్ధన్‌రెడ్డి, మహేశ్, రఘు పాల్గొన్నారు.

చొప్పదండి.. స్థానికేతరులదేనండి!

- ఆరుసార్లు నియోజకవర్గేతరులదే విజయం
- రెండు దశాబ్దాలుగా గెలవని జాతీయ పార్టీలు
- టీడీపీ కంచుకోటకు బీటలు
- గోదావరి జలాలతో వాటర్ హబ్‌గా మారిన వైనం

1957లో శాసనసభ నియోజకవర్గం ఏర్పాటు



చొప్పదండి: చొప్పదండి శాసనసభ నియోజకవర్గం 1957లో ఏర్పడింది. అప్పటినుంచీ స్థానికేతరులకు అడ్డాగా మారింది. అసెంబ్లీ ఎన్నికల బరిలో ప్రధాన పార్టీల తరఫున నియోజకవర్గేతరులు పోటీ చేయడం సర్వసాధారణమైంది. ఇప్పటివరకు పన్నెండు సార్లు ఎన్నికలు జరుగగా, ఆరుసార్లు స్థానికేతరులే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. పలుమార్లు ఓడిపోయిన అభ్యర్థులు కూడా స్థానికులు కాకపోవడం ఈ నియోజకవర్గ ప్రత్యేకత.

తొమ్మిది సార్లు రెండోస్థానమూ వారిదే

చొప్పదండి నుంచి 1957లో పీడీఎఫ్ తరఫున పోటీ చేసిన వేములవాడ మండలానికి చెందిన చెన్నమనేని రాజేశ్వర్‌రావు తొలిసారి ఎన్నికల్లో గెలుపొందారు. రెండోసారి 1962లో జరిగిన ఎన్నికల్లో బెజ్జంకి మండలానికి చెందిన బి.రాములు ఎన్నికయ్యారు. స్థానిక అభ్యర్థులుగా 1978లో న్యాలకొండ శ్రీపతిరావు, 1985 నుంచి వరుసగా మూడుసార్లు న్యాలకొండ రాంకిషన్‌రావులు మాత్రమే గెలిచారు. 1983లో పెగడపల్లి మండలానికి చెందిన గుర్రం మాధవ రెడ్డి, 1999లో కరీంనగర్‌కు చెందిన కోడూరి సత్యనారాయణగౌడ్, 2004లో వెల్గటూరు మండలానికి చెందిన సాన మారుతి విజయం సాధించారు. 2009లో అంతర్గాంకు చెందిన సుద్దాల దేవయ్య, 2014లో సైదాపూర్ మండలంలోని వెంకటేశ్వరుల పల్లెకు చెందిన బొడిగె శోభ గెలుపొందారు. ఇక పన్నెండు సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తొమ్మిది సార్లు రెండో స్థానంలో నిలిచినవారూ స్థానికేతరులే కావడం కొసమెరుపు.

పునర్విభజనతో విచ్ఛిన్నం

నియోజకవర్గంలో ప్రధానంగా చొప్పదండి, రామడుగు, గంగాధర మండలాలు పూర్తిస్థాయిలో ఉన్నాయి. పునర్విభజనకు ముందు కరీంనగర్ మండలంలో కొన్ని గ్రామాలు, వెల్గటూర్, పెగడపల్లి, గొల్లపల్లి మండలాల్లో మరికొన్ని గ్రామాలు ఉండేవి. పునర్విభజన సమయంలో చొప్పదండి, రామడుగు, గంగాధరతోపాటు కొడిమ్యాల, మల్యాల, బోయినపల్లి మండలాలను చొప్పదండిలో కలిపారు. ఇక తెలంగాణ వచ్చాక నూతన జిల్లాల ఏర్పాటు సమయంలో చొప్పదండి నియోజకవర్గాన్ని మూడు ముక్కలు చేశారు. ప్రస్తుత కరీంనగర్ జిల్లాలో మూడు మండలాలు ఉండగా, బోయినపల్లి మండలాన్ని రాజన్నసిరిసిల్ల జిల్లాలో, కొడిమ్యాల, మల్యాల మండలాలను జగిత్యాల జిల్లాలో కలిపి, నియోజకవర్గ స్వరూపాన్ని మార్చేశారు.

జీవనోపాధికి వలసలే మార్గం

మెట్ట ప్రాంతమైన చొప్పదండి నియోజకవర్గ ప్రజలకు దశాబ్దాలుగా జీవనోపాధి నిమిత్తం వలసలు వెళ్లడమే ఏకైక మార్గం. బొంబాయి, భీవండితోపాటు దుబాయి, అబుదాబి, సౌదీ అరేబియా, మస్కట్, దోహా ఖతార్ తదితర దేశాలకు వెళ్తున్నారు. మెజారిటీ గ్రామాలు మెట్ట ప్రాంతంలో ఉండటంతో ఏటా వర్షాలపై ఆధారపడి పంటలు వేయడం, అవి చేతికి వచ్చే సమయంలో వర్షాభావంతో ఎండిపోవడం, లేదా దిగుబడి తగ్గుతున్న దుస్థితిని ఇక్కడి రైతులకు ఎదుర్కొంటున్నారు.

వరద కాలువతో పెను మార్పు

అర్ధ శతాబ్దం క్రితం నిర్మించిన శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ తవ్వకంతో చొప్పదండి నియోజకవర్గంలోని పలు గ్రామాలకు సాగునీరందేది. ఆపై కాలువల తవ్వకం లేకపోవడంతో సాగునీటి కోసం రైతులు పోరాటాలు చేసేవారు. తన పాదయాత్రలో వారి కష్టాలను ఉమ్మడి ఏపీ మాజీ సీఎం, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి వరద కాలువ నిర్మాణం పూర్తి చేశారు. ఇది ఎక్కువగా ఈ నియోజకవర్గంలోనే విస్తరించి ఉంది. ఈ కాలువకు తోడు ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మించి పైప్‌లైన్ ద్వారా నారాయణపూర్ ప్రాజెక్టుకు నీటిని తరలించే పనులను, మిడ్ మానేరు నిర్మాణానికి భూసేకరణను వైఎస్సార్ హయాంలోనే పూర్తి చేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత చివరి దశ పనులు జరిగి, చొప్పదండి వాటర్ హబ్‌గా మారింది. లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్, బోయిన్‌పల్లి మండలంలో నిర్మించిన మిడ్ మానేరు ప్రాజెక్టు, మల్యాల నుంచి బోయినపల్లి వరకు నిర్మించిన వరద కాలువ ప్రస్తుతం నీటితో కళకళలాడుతున్నాయి. భూగర్భ జలాలు పెరగడంతో బావుల ద్వారా వ్యవసాయం చేసేలా పరిస్థితి మారింది.

ప్రభావం చూపే అంశాలు

నియోజకవర్గంలోని ఓటర్లలో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉన్నారు. ఇక్కడి ప్రజలకు వ్యవసాయమే ఆధారం. చాలీచాలని ఆదాయంతో చేనేత, మరమగ్గాల కార్మికులు జీవనం సాగిస్తున్నారు. ప్రతీసారి విలక్షణ తీర్పు ఇవ్వడం ఈ నియోజకవర్గ ఓటర్ల ప్రత్యేకత. తెలంగాణ రాక ముందు పదిసార్లు శాసనసభ ఎన్నికలు జరగగా ఆరు సార్లు టీడీపీ, నాలుగు సార్లు ఇతరులు గెలుపొందగా, తెలంగాణ వచ్చాక టీడీపీ కంచుకోటకు బీటలు వారాయి. ప్రత్యేక రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో రెండుసార్లు బీఆర్‌ఎస్ అభ్యర్థులే గెలిచారు. గడిచిన ఆరు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థి మళ్లీ గెలవకపోవడం, రెండు దశాబ్దాలుగా జాతీయ పార్టీలను గెలుపుతీరాలకు చేర్చకపోవడం, ప్రాంతీయ పార్టీలనే అక్కున చేర్చుకోవడం వంటివి చొప్పదండి విశేషాలు.

గెలుపు, ఓటముల వివరాలు

ఏడాది	గెలిచిన అభ్యర్థి	పోలైన ఓట్లు	ఓడిన అభ్యర్థి	పోలైన ఓట్లు
1957	రాజేశ్వర్‌రావు (పీడీఎఫ్)	99,074	బి.రాములు (కాంగ్రెస్)	8,054
1962	బి.రాములు (కాంగ్రెస్)	15,749	ఆర్.రెడ్డి (స్వతంత్ర్య)	8,216
1978	ఎస్.శ్రీపతిరావు (కాంగ్రెస్.ఐ)	26,311	ఎం.కృష్ణారెడ్డి (కాంగ్రెస్)	20,054
1983	జి.మాధవరెడ్డి (టీడీపీ)	36,133	ఏఎస్.రెడ్డి (కాంగ్రెస్)	18,651
1985	ఎన్.రాంకిషన్‌రావు (టీడీపీ)	55,141	బండారి రామస్వామి (కాంగ్రెస్)	13,704
1989	ఎన్.రాంకిషన్‌రావు (టీడీపీ)	47,783	కె.సత్యనారాయణగౌడ్ (కాంగ్రెస్)	39,921
1994	ఎన్.రాంకిషన్‌రావు (టీడీపీ)	56,287	కె.సత్యనారాయణగౌడ్ (కాంగ్రెస్)	30,600
1999	కె.సత్యనారాయణగౌడ్ (కాంగ్రెస్)	54,754	ఎన్.రాంకిషన్‌రావు (టీడీపీ)	52,842
2004	సాన మారుతి (టీడీపీ)	45,211	కె.సత్యనారాయణగౌడ్ (కాంగ్రెస్)	41,096
2009	సుద్దాల దేవయ్య (టీడీపీ)	68,841	గుడుకొండ బాబు (కాంగ్రెస్)	35,853
2014	బొడిగె శోభ(టీఆర్‌ఎస్)	86,841	సుద్దాల దేవయ్య (కాంగ్రెస్)	31,860
2018	సుంకె రవిశంకర్ (టీఆర్‌ఎస్)	91,090	మేడిపల్లి సత్యం (కాంగ్రెస్)	48,963

ఓటర్ల వివరాలు

పురుషులు	1,11,197
మహిళలు	1,18,141
ఇతరులు	08
మొత్తం	2,29,346

క్లుప్తంగా

క్రీడలతో స్నేహ సంబంధాలు



వాలీబాల్ క్రీడాకారులతో ఎంపీపీ సంధ్యారాణి

రాయికల్: క్రీడలతో యువకుల్లో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి అన్నారు. మంగళవారం ఆల్యానాయక్ తండాలో ఏర్పాటు చేసిన మినీ వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎంపీపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నందు నాయక్, బీఆర్ఎస్ ఎస్టీ మండల ప్రధాన కార్యదర్శి తిరుపతినాయక్, మహేశ్‌నాయక్, గణేశ్, పీఈటీ వినోద్ పాల్గొన్నారు.

దసరా బందోబస్తులో ఎస్సై చేతి వేలికి గాయం

మల్యాల: మండల కేంద్రంలో సోమవారం దసరా ఉత్సవాల్లో మల్యాల ఎస్సై–2 కుమారస్వామి చేతికి గాయమైంది. దసరా ఉత్సవాల్లో భాగంగా మేకను బలిచ్చిన అనంతరం పలువురు తల్వార్‌కు ఉన్న రక్తం బొట్టు పెట్టుకునేందుకు ఎగబడ్డారు. ఈ క్రమంలో కత్తిని సురక్షితంగా తీసుకెళ్లేందుకు కత్తిని తీసుకునే క్రమంలో ఎస్సై కుమారస్వామి చేతి వేలికి గాయమైంది. ఆస్పత్రికి వెళ్లగా.. వేలికి మూడు కుట్లు పడినట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కమ్మునూర్ గ్రామ శివారులో ఓ యువకుడు పురుగుల మందు తాగగా.. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో మృతిచెందాడు. బీర్‌పూర్ ఎస్సై గౌతమ్ పవార్ కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా దసూరాబాద్ మండలం మున్యాల గ్రామానికి చెందిన రామగిరి నవీన్(24) ఈనెల 22న పురుగుల మందు తాగి కమ్మునూర్ గ్రామ శివారులో రోడ్డు పక్కన పడిపోయాడు. కమ్మునూర్ సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు అతడి జేబులో ఉన్న వివరాల ఆధారంగా బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్, బంధువులకు సమాచారం అందజేశారు. జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

మల్యాల(చొప్పదండి): మల్యాల మండలం ఒబులాపూర్ గ్రామ శివారులో మంగళవారం రాత్రి ఎస్సై తీగల అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. వారి నుంచి రూ.8,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఒబులాపూర్ గ్రామానికి చెందిన కాటిపెల్లి మహిపాల్‌రెడ్డి, బండి అశోక్, జగిత్యాలకు చెందిన చెన్న రాముపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కానిస్టేబుళ్లు రాజేందర్, సంతోష్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కత్తులతో దాడి.. నలుగురికి గాయాలు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని బీట్‌బజార్ ప్రాంతానికి చెందిన చట్ల శ్రీనివాస్, చట్ల సతీశ్, మరొకరిపై ఓ వ్యక్తి మంగళవారం రాత్రి కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. శ్రీనివాస్, సతీశ్‌కు పక్కింటి పెద్దింటి రాజుతో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. రాజు పాతకక్షలు మనసులో పెట్టుకుని శ్రీనివాస్, సతీశ్‌తోపాటు మరో వ్యక్తిపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. దాడిలో ముగ్గురికి బలమైన గాయాలయ్యాయి. దాడిని ఆపడానికి ప్రయత్నించిన రాజు కుమారుడు స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రులను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ నటేష్ సంఘటనస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

రౌడీషీటర్లపై పోలీస్ నిఘా

- జిల్లాలో ఇప్పటివరకు 180 మంది రౌడీషీటర్ల బైండోవర్
- ఠాణాల్లో ప్రత్యేక కౌన్సెలింగ్
- అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రత
- ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు(ఫైల్)

జగిత్యాలక్రైం: జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పోలీసులు ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టారు. 2009, 2014, 2018 సార్వత్రిక ఎన్నికలు, ఇతర ఎన్నికల్లో కొందరు రౌడీషీటర్లు ప్రత్యర్థులను, వారివెంట తిరిగే అనుచరులను హెచ్చరిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో భాగంగా జిల్లాలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. స్టేషన్లవారీగా రౌడీషీటర్లు, గ్యాంగ్‌స్టర్లు, వారి అనుచరుల చిట్టా తెరుస్తున్నారు. బైండోవర్ కేసుల్లో భాగంగా తహసీల్దార్ ఎదుట హాజరుపరుస్తూ రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షల వ్యక్తిగత పూచీకత్తుతో వదిలేస్తున్నారు. ఒకవేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా అరెస్టు చేసి జైలుకు పంపుతామని హెచ్చరిస్తున్నారు.

2084 మంది బైండోవర్

ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా పోలీసు శాఖ జిల్లాలోని 180 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేయగా ఎక్సైజ్ శాఖ రెండునెలల్లో 164 మందిని బైండోవర్ చేశారు. మొత్తం 2,084 మంది పాత నేరస్తులను బైండోవర్ చేశారు. ఒకరిద్దరు చోటామోటా నేతలు కూడా ఉండటం గమనార్హం. జిల్లాలో అనుమతి ఉన్న తుపాకులు కలిగిన వ్యక్తులు ఉంటే తక్షణమే వారి ఆయుధాలను పోలీసులకు అప్పగించాలని ఆదేశాలు జారీచేయగా ఆయా పోలీస్‌స్టేషన్లలో లైసెన్స్‌లు పొంది తుపాకులు ఉన్నవారు పోలీసులకు అప్పగించారు.

సుమారు 180 మందికి పైనే..

జిల్లా పోలీస్‌శాఖ పరిధిలో సుమారు 180 మందికి పైగా రౌడీషీటర్లు ఉన్నారు. దందాలు, బెదిరింపులు, హత్యలు, రౌడీయిజం, అక్రమ వ్యాపారాలు, అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నారు. నేరాల తీవ్రత ఆధారంగా వారిపై పోలీసులు రౌడీషీట్ తెరిచారు. ఎన్నికలు, పండుగలు, గణేశ్ నవరాత్రోత్సవాల సందర్భంగా ముందస్తుగా వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించడం, బైండోవర్ చేయడం సాధారణం. జిల్లాలో నేరస్తుల సర్వే నిర్వహించినప్పుడు ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారి వివరాలు సేకరించారు. తాజా ఫొటోలతో వారిపై నమోదైన నేరాలు, శిక్షలు, ప్రస్తుత జీవన విధానం, ప్రవర్తన కుటుంబ వివరాలు సేకరించి నేరాలను బట్టి కొత్తగా హిస్టరీ షీట్ పొందుపరుస్తున్నారు. వీరిలో కొందరిలో మార్పు రావడంతో చిన్న చితకా వ్యాపారాలు చేస్తున్నారు.

నేరస్తులపై నిఘా పెట్టాం



ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రౌడీషీటర్లు, పాత నేరస్తులను పోలీస్‌స్టేషన్ల వారీగా ఇప్పటికే బైండోవర్ చేశాం. నేరస్తుల కదలికలపై పోలీసుశాఖ నిరంతరం నిఘా పెడుతోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటన జరుగకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నాం.

– సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీ, జగిత్యాల

సామాన్యుడికి 'నగదు' కష్టాలు!

- బ్యాంకులు వ్యాపార కూడళ్ల వద్ద పోలీసుల తనిఖీలు
- రూ.50 వేల కన్నా ఎక్కువ తీసుకెళ్తే సీజ్
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, వ్యాపారులు



గొల్లపల్లిలో వాహన తనిఖీ చేస్తున్న పోలీసులు

గొల్లపల్లి: కూతురు వివాహానికి బంగారం కొనేందుకు వెళ్లాలన్నా.. పండుగపూట కుటుంబమంతా షాపింగ్‌కు వెళ్లాలన్నా.. దసరా సీజన్‌లో వచ్చిన నగదును వ్యాపారులు ఇంటికి తీసుకెళ్లాలన్న భయమే.. ఎన్నికల తనిఖీల్లో భాగంగా ఎక్కడ పట్టుకుంటారనే భయం అందరిలోనూ ఉంది. ఎన్నికల్లో నగదు పంపిణీని కట్టడి చేసేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహించే వాహనాల తనిఖీలతో సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిచోట్ల తనిఖీ బృందాలు అతిగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. పెళ్లిళ్ల సీజన్ కావడంతో బంగారం కొనుగోలు చేయడం, షాపింగ్‌కు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. జగిత్యాల కొత్త బస్టాండ్ నుంచి మూడువైపులా పాత బస్టాండ్ వరకు బ్యాంకులు ఉన్నాయి. జగిత్యాల చుట్టూ, మున్సిపల్ కార్యాలయం సమీపంలో బ్యాంకుల ఎదుటే తనిఖీలు చేపడుతుండటంతో నగదు జమ చేసేందుకు ఇబ్బంది పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెళ్లిళ్ల సీజన్‌తో...

నవంబర్‌లో పెళ్లిళ్ల సీజన్ కావడంతో అవసరమైన ఆభరణాలు, బంగారం కొనుగోలు కోసం నగదును తీసుకెళ్లడం ఇబ్బందికంగా మారింది. తులం బంగారం కొనాలంటే రూ.62 వేలు అవసరం.పెళ్లిళ్లలో ఐదు తులాల నుంచి ఇరవై తులాల వరకు బంగారం కొనుగోలు చేయాల్సి ఉంటుంది. రూ.లక్షల్లో నగదును తీసుకెళ్తే పోలీసులు ఎక్కడ పట్టుకుంటారోనని ఆందోళన చెందుతున్నారు. రూ.50 వేల కన్నా ఎక్కువ తీసుకెళ్తే ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు తెలుపుతున్నారు.

వ్యాపారులకూ తిప్పలు..

దసరా సీజన్‌లో వచ్చిన నగదును వ్యాపారులు దుకాణాల నుంచి రాత్రిపూట ఇంటికి తీసుకెళ్తారు. జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల పట్టణాల్లో మెడికల్, ఏజెన్సీలు, సూపర్‌మార్కెట్లు, బంగారం, బట్టల దుకాణాల వ్యాపారులు నగదును తీసుకెళ్తుంటారు. చెక్‌పోస్టుల వద్ద నగదును పోలీసులు స్వాధీనం చేసుకుంటే ఎలా అని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. రాజకీయ నాయకులు నగదును తీసుకెళ్తే పట్టుకోవాలే తప్ప సామాన్యులను ఇబ్బంది పెట్టడం సరికాదని వారు వాపోతున్నారు.

వస్తాపూర్‌లో వ్యక్తి సజీవ దహనం



పరిశీలిస్తున్న ఎస్సై అజయ్

రాయికల్: వస్తాపూర్ గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం కాగా.. అందులో ఓ వ్యక్తి సజీవ దహనమైనట్లు ఎస్సై అజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. వస్తాపూర్ గ్రామానికి చెందిన సంకె చిన్నభూమయ్య(37) పండగ నిమిత్తం తన భార్య లక్ష్మీ, పిల్లల్ని పుట్టిల్లు రేచపల్లి గ్రామానికి పంపించి మద్యం తాగి ఇంట్లో ఒక్కడే నిద్రపోయాడు. అదే సమయంలో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. మద్యం మత్తులో ఉన్న భూమయ్య సజీవ దహనమైనట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానికులు మంటలార్పేందుకు ప్రయత్నించగా.. అప్పటికే కాలిబూడిదయ్యాడు. ఇల్లు పూర్తిగా దగ్ధం కావడంతో నిత్యావసర వస్తువులు, దుస్తులు, రెండు తులాల బంగారం, 20 తులాల వెండి, సుమారు రూ.6లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని మృతుడి భార్య లక్ష్మీ ఆవేదన వ్యక్తం చేసింది. లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

మద్యం మత్తులో భార్యను చంపి..

- క్షణికావేశంలో గొంతు నులిమి..



సుమలత(ఫైల్)

జగిత్యాలక్రైం: భార్యాభర్తల మధ్య నిత్యం జరుగుతున్న గొడవలు చివరికి ఒకరి ప్రాణాన్ని బలి తీసుకున్నాయి. మద్యం మత్తులో కట్టుకున్న భార్య గొంతు నులిమి కడతేర్చాడు ఆ కసాయి భర్త. జగిత్యాల పట్టణ శివారులోని 40వ వార్డు టీఆర్‌నగర్‌కు చెందిన కట్ట సుమలత(37)ను ఆమె భర్త కట్ట సంజీవ్ సోమవారం మధ్యాహ్నం హత్య చేశాడు. కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామానికి చెందిన కన్నం వెంకటయ్య కుమార్తె సుమలతను టీఆర్‌నగర్‌కు చెందిన కట్ట సంజీవ్‌కు 2002లో ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు. కొద్దికాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే 9 నెలల క్రితం సుమలత అత్త, మామతో పాటు ఆమె చిన్న మామలపై వరకట్నం కేసు పెట్టింది. అప్పటి నుంచి తమ తల్లిదండ్రులపై కేసు పెట్టావని సంజీవ్ మనసులో పెట్టుకొని అదనపు కట్నం కావాలని వేధిస్తున్నాడు. సోమవారం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో మద్యం మత్తులో ఉన్న సంజీవ్ సుమలత గొంతు నులిమి హత్య చేశాడు. విషయం తెలుసుకున్న డీఎస్పీ వెంకటస్వామి, రూరల్ సీఐ ఆరీఫ్‌అలీఖాన్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం మృతురాలి తండ్రి కన్నం వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ తెలిపారు.

వెంటాడిన మృత్యువు..

- మద్దుట్లలో వృద్ధురాలిని ఢీకొన్న బైక్
- ఆమెను కారులో ఆస్పత్రికి తరలిస్తుండగా మరో కారు ఢీ
- వృద్ధురాలి మృతి.. కారులోని మరో నలుగురికి తీవ్ర గాయాలు



మృతిచెందిన లక్ష్మీ

మల్యాల(చొప్పదండి): పండుగ రోజు ఆ ఇంట్లో విషాదం నింపింది. బైక్ ఢీకొన్న సంఘటనలో గాయపడిన వృద్ధురాలిని కారులో ఆస్పత్రికి తరలిస్తుండగా.. మరో కారు వచ్చి ఢీకొన్న సంఘటనలో వృద్ధురాలు మృతిచెందడంతో పాటు మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మల్యాల మండలం మద్దుట్ల గ్రామానికి చెందిన వెల్మల లక్ష్మీ(60) ఆదివారం రాత్రి బతుకమ్మ ఆడి నిమజ్జనం అనంతరం ఇంటికి తిరిగి వెళ్తుండగా.. పోతారం గ్రామానికి చెందిన కట్కూరి రవితేజ బైక్‌తో ఆమెను ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మీని కుమారుడు వెల్మల మోహన్ మరో ముగ్గురితో కలిసి రాత్రి కారులో జగిత్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా.. జగిత్యాల పట్టణంలోని బస్ డిపో సమీపంలో మరో కారు ఢీకొంది. లక్ష్మీ అక్కడికక్కడే మృతిచెందగా, మృతురాలి కుమారుడు మోహన్ తీవ్రంగా గాయపడ్డాడు. కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న మరో ముగ్గురు దాసరి గణేశ్, డబ్బు తిరుపతి, డబ్బు రాజశేఖర్‌రెడ్డి తీవ్రంగా గాయపడగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

డెంగీతో మహిళ మృతి



సుగుణ(ఫైల్)

కథలాపూర్: కథలాపూర్ మండల కేంద్రానికి చెందిన రిక్కల సుగుణ(58) అనే మహిళ డెంగీ జ్వరంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సుగుణ మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా.. కథలాపూర్‌లోని ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అనంతరం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతురాలికి భర్త చిన్నరాజం, కుమారుడున్నారు.

మద్యం పట్టివేత

కథలాపూర్: కలిగోట గ్రామ శివారులోని చెక్‌పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఎన్నికల స్క్వాడ్ టీం అధికారులు మంగళవారం తెలిపారు. బాటిళ్లను కథలాపూర్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించామని అధికారి అనిల్‌కుమార్ పేర్కొన్నారు.

రూ.1.28 లక్షలు పట్టివేత



మెట్‌పల్లిరూరల్: ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును పట్టుకున్నట్లు మెట్‌పల్లి ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. మంగళవారం మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయం సమీపంలోని అంతర్ జిల్లా చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా.. రూ.1.28లక్షల నగదు పట్టుబడిందన్నారు. ఆ మొత్తాన్ని జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు తెలిపారు.

రైతు ఆత్మహత్య

ఓదెల(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం చిన్నకొమిర గ్రామానికి చెందిన రైతు పచ్చిక రవీందర్‌రెడ్డి(35) మంగళవారం సాయంత్రం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి తనకున్న మూడు ఎకరాల్లో ఈ వానాకాలంలో వరి పంట వేశాడు. పంట ప్రస్తుతం కోతదశకు చేరింది. అయితే, ఏమైందో ఏమోకానీ, మంగళవారం సాయంత్రం ఇంటివెనుకాలకు వెళ్లి గడ్డివాములో నిల్వచేసిన పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు చూసి వెంటనే కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే చనిపోయాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరావడంలేదు. మృతుడికి భార్య సాత్విక, ఇద్దరు కుమారులు ఉన్నారు. రైతు ఆత్మహత్యపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పొత్కపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు.

27న ఉమ్మడి జిల్లా ఎస్జీఎఫ్ యోగా పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఈ నెల 27న ఉమ్మడి జిల్లాస్థాయి అండర్ 14, 17, 19, బాలబాలికల యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, సీహెచ్.జనార్దన్‌రావు తెలిపారు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు సంబంధించిన బాలబాలికలు సంబంధిత అర్హత ధ్రువపత్రాలతో ఉదయం 10గంటలకు స్పోర్ట్స్ స్కూల్‌లో జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్‌కు రిపోర్టు చేయాలన్నారు. పూర్తి వివరాలకు 99487 50362 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్

- మంత్రి ఈశ్వర్



పెగడపల్లిలో కండువా వేస్తున్న మంత్రి ఈశ్వర్

పెగడపల్లి: ఒకసారి అవకాశమిస్తే అభివృద్ధి చేస్తామని, అమలుకు సాధ్యం కాని హామీలిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెడుతోందని ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఈశ్వర్ విమర్శించారు. మంగళవారం పెగడపల్లి మండల కేంద్రంలోని శివాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. పెగడపల్లిలో స్థానిక నాయకులతో మంత్రి వివిధ కుల సంఘాల సభ్యులు, వ్యాపారస్తులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో తనకు మద్దతు పలకాలని కోరారు. నందగిరి గ్రామానికి చెందిన యువత పార్టీ సీనియర్ నాయకుడు నరెడ్డి రాజిరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా.. వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అభివృద్ధి, సంక్షేమం లేక ప్రజలు అష్టకష్టాలు పడిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. జెడ్పీటీసీ రాజేందర్‌రావు, వైస్ ఎంపీపీ గంగాధర్, విండో చైర్మన్లు, రమణారావు, వేణుగోపాల్, ఆర్బీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వెంకన్న, సర్పంచ్ శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ కరుణాకర్‌రావు, మాజీ సర్పంచ్ రాజు, నాయకులు స్వామి, లక్ష్మీనారాయణ, సాగర్‌రావు, ప్రవీణ్‌రావు, లోకేశ్, సుధాకర్, ప్రదీప్, రాజేశం, శ్రీనివాస్‌రెడ్డి, లచ్చయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

ధర్మపురి: ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 60 ఏళ్ల పాలనలో చేపట్టని అభివృద్ధిని ముఖ్యమంత్రి 9 ఏళ్ల పాలనలో చేసి చూపించారని కొనియాడారు. రానున్న రోజుల్లో ధర్మపురి పట్టణ రూపురేఖలు మారుతాయని అన్నారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు పక్షాన పోరాడేది కాంగ్రెస్

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



ఇటిక్యాలలో పార్టీలో చేరిన వారితో జీవన్‌రెడ్డి

రాయికల్: రైతు పక్షాన పోరాడేది కాంగ్రెస్ పార్టీ అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఇటిక్యాలలో మాజీ సర్పంచ్ కుంట గంగారెడ్డి ఆధ్వర్యంలో 50 మంది కార్యకర్తలు ఎమ్మెల్సీ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. రైస్ మిల్లర్ల దోపిడీతో రైతులు ఆర్థికంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జరగబోయే ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే ప్రజాసేవ చేస్తానన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, ఎంపీటీసీ రాధ ఆదిరెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపల్లి గంగారెడ్డి, నాయకులు బూసవేని శ్రీనివాస్‌యాదవ్, రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపల్లి గంగారెడ్డి పాల్గొన్నారు.

గెలిపిస్తే భరోసా

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే యువతకు భరోసా కల్పిస్తానని ఎమ్మెల్సీ అన్నారు. ఇటిక్యాల గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ హామీలన్నీ మభ్యపెట్టేవే..

- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



కథలాపూర్‌లో ఎన్నికల ప్రచారంలో వినోద్‌కుమార్

కథలాపూర్(వేములవాడ): ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న హామీలన్నీ మభ్యపెట్టేవిగా ఉన్నాయని, వాటిని ప్రజలు నమ్మే స్థితిలో లేరని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం కథలాపూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు మద్దతుగా ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1969 సంవత్సరంలో తెలంగాణ ఉద్యమం జరిగితే కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక రాష్ట్రం రాకుండా చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, నాయకులు నాగేశ్వర్‌రావు, కల్లెడ శంకర్, సబ్బని గంగు, గుండారపు గంగాధర్, రిక్కల సంజీవ్‌రెడ్డి, రాయికంటి శేఖర్, ఎండీ రఫీక్, ముంజ దశాగౌడ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి: త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మపురిలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పార్టీ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కార్యకర్తలను కోరారు. పెగడపల్లి మండలం శాలపల్లి గ్రామ బీఆర్ఎస్, బీజేపీకి చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు మంగళవారం లింగాపూర్ సర్పంచ్ శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో లక్ష్మణ్‌కుమార్ పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్‌ను గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. మండల అధ్యక్షుడు రాములుగౌడ్, శ్రీనివాస్, తిరుపతి, వంశీధర్ రావు, శ్రీధర్‌రావు, భాస్కర్, రాజేందర్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

వెల్గటూర్: తెలంగాణలో ఎగిరేది కాంగ్రెస్ జెండానే అని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామం నుంచి 100 మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌ను వీడి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కేసీఆర్ దళిత ముఖ్యమంత్రి హామీని తుంగలో తొక్కారని, దళితులకు మూడెకరాల భూమి అటకెక్కిందని, డబుల్ బెడ్రూం ఊసే లేదని ఆరోపించారు. కార్యక్రమంలో వెల్గటూర్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, ఎండపల్లి సింగిల్‌విండో మాజీ చైర్మన్ మద్దుల గోపాల్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు పూదరి రమేష్, వెల్గటూర్ సర్పంచ్ మురళిగౌడ్, ఎంపీటీసీ తిరుపతి, అసెంబ్లీ అధికార ప్రతినిధి విజయ్, సర్పంచ్ లచ్చయ్య, నాయకులు గెల్లు శ్రీనివాస్, సందీప్‌రెడ్డి, మల్లేశం, శ్రీనివాస్, సాగర్, తిరుపతి, హరీష్, సంజీవ్, మహేష్, అశోక్, భైరంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని చెగ్యాం, శాలపల్లి, తాళ్లకొత్తపేట గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరారు. సుమారు 250 మందికి పైగా చేరగా.. వారికి లక్ష్మణ్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

'మేడిగడ్డ' కుంగడానికి కేసీఆరే బాధ్యుడు

- కాళేశ్వరంపై సమగ్ర విచారణ జరపాల్సిందే
- పెట్టిన ఖర్చంతా కేసీఆర్ ముక్కుపిండి వసూలు చేయాల్సిందే
- ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తే నవ్వులపాలయ్యేవాళ్లం



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కాళేశ్వరం ప్రాజెక్టుపై సమగ్ర విచారణ జరపాలని, మేడిగడ్డ పిల్లర్ల కుంగిపోవడానికి కేసీఆర్ బాధ్యత వహించాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్‌లో బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్‌తోపాటు మంత్రి కేటీఆర్ తీరుపైనా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. «కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజీలోని 8 పిల్లర్లు కుంగిపోయినయ్.. సీఎం కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, వంతెనలు, రోడ్లు, ఫ్లైఓవర్లకు గ్యారంటీ లేదు.. చివరకు రాష్ట్ర ప్రజల భవిష్యత్‌కు కూడా గ్యారంటీ లేకుండా పోయింది.. గతంలో మల్లన్నసాగర్ రిజర్వాయర్‌దీ ఇదే పరిస్థితి.. రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చు చేసిన కాళేశ్వరం నిర్మించి ఐదేళ్లు కూడా కాలేదు.. మొన్నటి వానలకు మోటార్లు నీట మునిగిపోయినయ్.. ఇప్పుడు పిల్లర్లు ఒంగిపోయి ప్రాజెక్టు ఉంటదో.. ఊడిపోతదో తెల్వదు.. దీనికి బాధ్యుడు సీఎం కేసీఆర్.. వెంటనే ఆయన నుంచి ఖర్చు చేసిన సొమ్మంతా రికవరీ చేయాలి.. ప్రాజెక్టు రూపకర్త నేనేనని, అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చి అపర భగీరథుడిగా ప్రచారం చేసుకున్న కేసీఆర్ ఎటుపోయిండు..? నదులకే నడక నేర్పిన మొనగాడు ఏమైండు..? ఆయనే ఇంజినీర్, కాంట్రాక్టర్.. ఆయనే కమీషన్లు తీసుకుని ప్రజలను నట్టేట ముంచుతున్నడు.. కరోనా వస్తే పారాసిటమాల్ వేసుకోవాలని పోయి ఫాంహౌస్ లో పడుకున్నడు» అని ధ్వజమెత్తారు..

జాతీయ హోదా ఇచ్చి ఉంటే..

కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా రావాలనుకుని ఆశించినం.. పొరపాటున వచ్చి ఉంటే దేశవ్యాప్తంగా నవ్వులపాలయ్యేవాళ్లం.. పలుమార్లు వెళ్లిన నువ్వు కాళేశ్వరం వెళ్లి చేసిందేమిటి? నీ ఫాంహౌస్‌లో క్షుద్రపూజలు చేసి వాటిని కాళేశ్వరంలో కలపడానికి పోయినవే తప్ప.. ఏనాడూ పనుల నాణ్యతను పరిశీలించడానికి వెళ్లలేదు.. నిజంగా నాణ్యతతో ప్రాజెక్టు నిర్మించి ఉంటే.. ఇంతవరకు రాజకీయ పార్టీల నాయకులు, ఇంజినీరింగ్ నిపుణులను చూడటానికి ఎందుకు అనుమతించడం లేదు? హైదరాబాద్‌లో ఎన్నిఫ్లోర్లతో భవంతులు కట్టుకున్నా.. కేసీఆర్ కొడుకుకు అందులో ఫ్లోర్లు నిర్మించాలి.. కేసీఆర్ కొడకా.. నీకున్న రాజకీయాల్లో డిగ్రీ ఏంది? మీ అయ్య పేరు చెప్పుకుని రాజకీయాల్లోకి వచ్చిన నీ బతుకేంది? నేను నీలెక్క అయ్య పేరు చెప్పుకుని రాజకీయాల్లోకి రాలేదు.. ఇకనైనా నోటిని హద్దులో పెట్టుకుని మాట్లాడు.. రెండు, మూడు రోజుల పాటు చర్చించిన అనంతరం బీజేపీ అభ్యర్థుల రెండో జాబితాను విడుదల చేయబోతున్నాం.. అని బండి సంజయ్ పేర్కొన్నారు.